
ప్రజాశక్తి
శనివారం 28 అక్టోబర్ 2023 5 విజయనగరం



నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తు ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకొని మాన్సాస్ గ్రౌండ్స్‌లో (పెద్ద చెరువు గట్టు కింద) డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఈ బజార్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభించనున్నారు. మన రాష్ట్రంలోని 26 జిల్లాలతో పాటు తెలంగాణ, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులు పాల్గొంటాయి. సుమారు 250 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన 28వ తేదీ నుంచి నవంబరు 8వ తేదీ వరకు జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలు వరకు స్టాల్స్ తెరిచి ఉంటాయి.

చంద్రబాబుకు ఓటు.. అభివృద్ధికి చేటు

సామాజిక సాధికార బస్సుయాత్రలో మంత్రులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

చంద్రబాబు నాయుడుకు ఓటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి, మన పిల్లలు భవిష్యత్ కు చేటు అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉప ముఖ్యమంత్రులు బుడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వైసిపి నాయకులు చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గ కేద్రంలో శుక్రవారం సాయంత్రం చేరుకుంది. తొలుత గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో వేలాది మంది కార్యకర్తలు, నాయకులు బస్సు యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం మెంటాడ రోడ్డులో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు మాట్లాడారు.

ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నాలుగేళ్ళ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు చేసిన మేలు గురించి వివరించేందుకు సామాజిక సాధికారిత బస్సు యాత్ర చేపట్టామన్నారు. ఐదేళ్ల క్రితం తమకు ఓటు వేస్తే బ్యాంక్ రుణాలు రద్దు చేస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశాడన్నారు. జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేశామని, రైతులకు రైతు భరోసా కింద రూ.13వేలు ఇచ్చామని తెలిపారు. సచివాలయాల ద్వారా ఎటువంటి అవినీతి లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన తమ ప్రభుత్వానిదని అన్నారు. విద్యుత్తు బిల్లులు ఒక్క మన రాష్ట్రంలోనే పెరగలేదని, దేశమంతా పెరిగాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు కల్పించామన్నారు. ప్రజా ధనం తినడం వల్లే చంద్రబాబును సిబిఐ అరెస్టుచేసిందన్నారు. విశాఖను రాజధానిని చేస్తామంటే చంద్రబాబు అడ్డుకుంటున్నారన్న విషయం ప్రజలు గ్రహించాలన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మన పిల్లాడి పీక మనమే కోసినట్లనని అన్నారు.



సభలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ మన జీవితాలు, సామాజిక పరిస్థితులు ఎలా మారాయనేది చూడాలని, జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పీడిక రాజన్నదొర మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారం లో భాగస్వామ్యం కల్పించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడైనా వెనుకబడిన కులాలను ఆదుకున్నారా అని ప్రశ్నించారు. బాబు వస్తే జాబ్ అన్నాడు ఇచ్చాడా అని ప్రశ్నించారు. 99 శాతం హామీలను అమలు చేసిన జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు.

పేదలు అభివృద్ధి జగన్ తోనే సాధ్యం

పేదల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. 2024లో మరలా మన ముందుకు మోసగాళ్ళు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా అందించిన ప్రభుత్వం తమదని అన్నారు.

సభలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు శంబంగి చిన అప్పలనాయుడు, కడిబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, బడుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన జనం

విజయనగరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ

విజయనగరం టౌన్ : విజయనగరం చేరుకున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు నియోజకవర్గంలో అపూర్వ ఆదరణ లభించింది. బస్సుయాత్రకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని తన నివాసం వద్ద నుంచి కోలగట్ల జెండా ఊపి ప్రారంభించారు. వందలాది ద్విచక్ర వాహనాలతో బస్సు యాత్రతోపాటు అంబేద్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ, కలెక్టరేట్ మీదుగా గొట్లాం వరకూ ర్యాలీ సాగింది. జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, జి.ఈశ్వర్ కౌశిక్, ఇతర యువజన విభాగం నాయకులు, కార్పొరేటర్లు స్వయంగా వాహనాలు నడుపుతూ ర్యాలీలో ముందుకు సాగారు. అనంతరం గొట్లాం నుంచి బస్సు యాత్ర గజపతినగరం బయల్దేరింది.

జిల్లాలో ఓటర్లు 15,17,365 మంది

- పురుషులు 7,50,056
- మహిళలు 7,67,207
- థర్డ్ జెండర్ ఓటర్లు 102
- డిసెంబర్ 9లోగా అభ్యంతరాలు స్వీకరణ : కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఎస్ఎస్ఆర్ -2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను కలెక్టర్ నాగలక్ష్మి విడుదల చేశారు. అందుకు సంబంధించిన ఓటర్ల జాబితా సిడిలను నియోజకవర్గం వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ ఎస్-ఎస్ఆర్ -2024లో భాగంగా 27-10-23 నాటికి జిల్లాలో 15,17,365 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుష ఓటర్లు 7,50,056 మంది , మహిళా ఓటర్లు 7,67,207 మంది కాగా థర్డ్ జెండర్ ఓటర్లు 102 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ లో భాగంగా ఓటర్ల జాబితాలో ఏవైనా క్లెయిములు, అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు. డిసెంబర్ 26 లోపల అభ్యంతరాలను, ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. 5.1.24న ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ ఇస్తామని తెలిపారు. అర్హులై ఉండి ఎవరికైనా ఓటరు జాబితాలో పేరు రాకపోయినా, వారి పేరు తొలగించినా ఆన్‌లైన్ ద్వారా కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలియజేయ వచ్చున్నారు. ఓటర్ల నమోదు, తొలగింపుపై నవంబర్ 4,5తేదీలు , డిసెంబర్ 2,3తేదీలు, నాలుగు రోజులు స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కాంపెయిన్ లో బిఎల్ఒలంతా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శత శాతం కచ్చితమైన జాబితాలు తయారు కావాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అనంతరం కలెక్టర్ తహశీల్దార్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నియోజకవర్గం పరిధి లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇఆర్ఒలు డ్రాఫ్ట్ పబ్లికేషన్లను విడుదల చేసి ప్రదర్శించాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో, కళాశాలల్లో ప్రిన్సిపల్స్ తో మాట్లాడి 18 ఏళ్ళు నిండిన వారందరిని ఓటర్లుగా చేర్పించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, విజయనగరం . బొబ్బిలి ఆర్‌డిఒలు సూర్య కళ, సాయి శ్రీ, ఎస్‌డిసిలు వెంకటేశ్వర రావు, నూక రాజు, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే సామాజిక న్యాయం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక న్యాయం వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికారిత బస్సు యాత్ర లో భాగంగా శుక్రవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున తో కలిసి మాట్లాడారు. అధికారంలోకి రాకముందు జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేశారని గుర్తు చేశారు. పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ, గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేశామన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన తర్వాత జీవన ప్రమాణాలు ఏ విధంగా మెరుగుపడ్డాయో ఈ యాత్ర ద్వారా వివరిస్తామని తెలిపారు. టిడిపి ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. మేరుగ నాగార్జున మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రజలు అసమానతలకు గురయ్యారని, రాజ్యాంగబద్ధంగా వచ్చిన హక్కులు కాలరాయబడ్డాయని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో మోసపు మాటలు, అబద్ధపు హామీలతో వచ్చే టిడిపి దొంగల ముఠా పట్ల రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి ఒక్కటైన అమలు చేశారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా 2014 జూన్ లో ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో రైతు రుణ మాఫీ చేస్తామని సంతకం పెట్టాడని, కానీ చేయలేదని అన్నారు.

నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం ఆయా వర్గాలకు చేసిన మేలును, జిల్లాలో చేసిన అభివృద్ధిని వివరించేందుకు బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. అంతకుముందు వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు ఏమి చేశామో తెలియజేస్తామన్నారు. సమావేశంలో పార్టీ రీజనల్ ఇన్‌ఛార్జి వైవిసుబ్బారెడ్డి, డిప్యూటీస్పీకర్‌కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

బస్సుయాత్ర కాదు.. తుస్సుయాత్ర

టిడిపి నేత కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో వైసిపి చేపడుతున్నది బస్సు యాత్ర కాదని తుస్సుయాత్ర అని టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత పేదల గొంతు కోస్తున్న పెత్తందారు జగన్ రెడ్డి అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ వైసిపి నాయకులు సామాజిక సాధికారికత పేరుతో చేపడుతున్న బస్సు యాత్ర ఎందుకు చేస్తున్నారో అర్థం కావటం లేదని అన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం 20ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, బిసి సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వనందుకా ఈ బస్సు యాత్ర, ఒక్క ఇల్లు కూడా కట్టించి ఇవ్వనందుకా ఈ బస్సు యాత్ర అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏమైనా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారా అని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లు పెట్టి జీతాలు ఇచ్చుకున్నారే తప్ప ఇంకేమైనా సాధించారా అని అన్నారు. విజయనగరం జిల్లా చైర్మన్ స్థానం రిజర్వేషన్‌లో ఎస్‌సి మహిళకు వస్తే దాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తన మేనల్లుడు కోసం బిసి కోటా మార్చినందుకా ఈ యాత్ర చేస్తున్నారు? అని ప్రశ్నించారు. బస్సు యాత్ర చేసే నైతికత వైసిపి నాయకులకు లేదన్నారు. గడపగడపకు వైకాపా చేపట్టిన కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను నుంచి తప్పించుకోవడానికి ఈ బస్సు యాత్ర చేపడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్. కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పోలి నాయుడు, కార్యదర్శి బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరకు టన్ను మద్దతు ధర రూ.3,080

30న చెరకు క్రషింగ్ ప్రారంభం • ఇఐడి ప్యారీ సుగర్స్ యాజమాన్యం ప్రకటన

ప్రజాశక్తి- రేగిడి

చెరకు టన్ను మద్దతు ధర రూ 3,080లకు ఈ ఏడాది పెంచామని ఈనెల 30న చెరకు క్రషింగ్ ప్రారంభిస్తామని ఇఐడి ప్యారీ సుగర్స్ అసోసియేట్ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభి రామ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంకిలి ప్యారి సుగర్స్ కర్మాగారంలో స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. గతేడాది చెరకు టన్ను మద్దతు ధర రూ.2,980లు ఇవ్వగా ఈ ఏడాది వంద రూపాయలు పెంచుతూ 3,080 లకు పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ ఆడేందుకు యాజమాన్యం నిర్ణయించినట్లు వెల్లడించారు. గతేడాది 4.77 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ ఆడినట్లు వివరించారు. జిల్లాలో 2,564 ఎకరాల్లో మొక్క, 8,493 ఎకరాల్లో మమ్ము మొత్తం 11,057 ఎకరాలలో సాగు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్తగా చెరకు నాటిన రైతులకు భారీగా రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023-24 ఏడాదికి సంబంధించి అక్టోబర్ 2023 నుంచి 2024 సెప్టెంబర్ వరకు యాజమాన్యం సూచించిన రకాలు, చెరకు సాళ్ల మధ్య 4 అడుగులు దూరం నాటిన రైతులకు రూ.12,000 రాయితీ ఇస్తామన్నారు. 4 అడుగులు కంటే సాదా పద్ధతిలో నాటిన రైతులకు 11,000 రూపాయలు రాయితీ ఇస్తామన్నారు. మమ్ము పద్ధతిలో సాగు చేసే రైతులకు రూ.2500 రాయితీ ఇస్తామని వెల్లడించారు. మొక్క రాయితీ పొందడానికి రైతులు ఒక ఎకరం నుండి 30 టన్నులు చెరకు సరఫరా చేయాలని వెల్లడించారు. అలా కానీ ఎడల 25 టన్నుల వరకు దామాస పద్ధతిలో రాయితీ వర్తిస్తుందన్నారు. 25 టన్నుల కంటే తక్కువ సరఫరా చేస్తే రాయితీ వర్తించదని స్పష్టం చేశారు. మమ్ము తోటలకు సంబంధించి ఒక ఎకరా నుంచి 25 టన్నులు చెరకు సరఫరా చేయాలన్నారు. కానీ ఎడల 20 టన్నుల వరకు దామాషా పద్ధతిలో రాయితీ వర్తిస్తుందన్నారు. 20 టన్నుల కంటే తగ్గిన రైతులకు రాయతీ వర్తిందన్నారు. జీడి, మామిడి తోటలను తొలగించి చెరుకు నాటిన రైతులకు అదనంగా ఎకరానికి రూ.5వేలు రాయితీ ఇస్తామన్నారు. యాజమాన్యం సూచించిన విత్తనాలు మాత్రమే నాటాలని కోరారు. ఇప్పటికే తుని, కర్ణాటక నుంచి 140 చెరకు నరుకు బంటాలను సిద్ధం చేశామన్నారు. సాళ్ల మధ్య దూరం నరుకుటకు 5 ఆధునాతన వాహనాలను రప్పించామన్నారు. రైతులు ఈ ఏడాది నాణ్యమైన చెరకు సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా కటింగ్ ఆర్డర్లు ఆయా డివిజన్ కర్మాగార ఉద్యోగులను కలవాలన్నారు. వచ్చే ఏడాది చెరుకు విస్తరణ పెంచేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎవిపితో పాటు కేన్ ఎజిఎం రాజేంద్రన్, హెచ్ ఆర్ మేనేజర్ వి. మురళీకృష్ణ, ఫైనాన్సర్ మేనేజర్ పి శ్యామ్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఇఐడి ప్యారీ సుగర్స్ ప్రతినిధి పట్టాభిరామ్

పరిశ్రమల స్థాపనకు భూ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పెండింగ్ ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్‌ను కలసి ఎపిఐఐసి, పరిశ్రమల శాఖ, ఆర్‌డిఒ వెంటనే భూ సంబంధిత అంశాల పై చర్చించుకొని పరిష్కారాన్ని చేయాలన్నారు. ముఖ్యంగా కొత్తవలస మండలం రెల్లిలో 158 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్, పెదరావుపల్లి గ్రామంలో నున్న 70ఎకరాల డి-పట్టా భూములు , కంటకాపల్లి భూముల అలియనేషణ్ కు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ సూర్యకళ కు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఇజిపి కింద ఆయా సంస్థలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను గడువు లోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు నెల రోజుల్లో 81 దరఖాస్తులు అందగా 48 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చామని, 29 దరఖాస్తులు వేర్వేరు శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయని, 4 దరఖాస్తులను తిరస్కరించామని డిఐసి జనరల్ మేనేజర్ పాపారావు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ గడువు లోగా ఆయా శాఖల వారు పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలు పేర్కొనాలని తెలిపారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డిఒ సూర్యకళ, జిఎం డిఐసి పాపారావు, ఎపిఐఐసి జిఎం యతిరాజు, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫాక్టరీస్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



రక్తదాతతో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండులో తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌పి ఎం. దీపిక ముఖ్య అతిధిగా హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పని చేస్తూ, తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించక పోవడం వలన, అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. అంతేకాకుండా, ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం కోల్పోతున్నారన్నారు. ఈనేపథ్యంలో తిరుమల - మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో పోలీసు కుటుంబాలకు, సామాన్య ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్‌పి కోరారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో పోలీసు కుటుంబాలు, సామాన్య ప్రజలు సుమారు 80మంది పాల్గొనగా, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేసారు. తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న కొంతమందిని గుర్తించి, మెరుగైన వైద్యం కోసంతిరుమల-మెడికవర్ ఆసుపత్రికి రిఫర్ చేసారు. కార్యక్రమంలో తిరుమల-మెడికవర్ నర్సింగ్‌హోమ్ ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్, విఎన్ పద్మకుమార్, పలువురు వై ద్యులుఉ పాల్గొన్నారు. ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

రక్త దానం చేయండి - ప్రాణదాతలుగా నిలవండి

పోలీసు పరేడ్ గ్రౌండులో 'రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ - రక్త దానంతో ప్రాణ దానం చేసినట్లేనని అన్నారు. ప్రాణాలను రక్షించేందుకు మనం చేసిన రక్త దానంతో ఒక వ్యక్తి జీవితం నిలబడుతుందన్నారు. సమాజ శ్రేయస్సు, రక్షణకు, శాంతియుత వాతావరణానికి ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం సబ్ డివిజను పరిధిలో పని చేసే పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అడ్డగోలు రహదారి పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రభుత్వం రిజర్వ్ చేసిన భూముల్లో నుంచి తమ లేఅవుట్ కు అడ్డుగోలుగా నిర్మించిన రహదారిని రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. దీనిపై పూర్తి నివేదికను ఇవ్వాలని ఆర్.ఐ కిషోర్‌కు తహశీల్దారు ఆదేశించారు. ప్రభుత్వ అట్టిపెట్టుకున్న భూముల్లో నుంచి మండలంలోని ఒక రిసార్ట్ సంస్థ ఎటువంటి అనుమతులూ లేకుండా గ్రావెల్ రహదారిని 40మీటర్లు వెడల్పున సుమారు 3కిలోమీటర్లు తమ లేఅవుట్‌కు వెళ్లేందుకు సొంత యంత్రాలతో నిర్మించుకున్నారు. దీనిపై ప్రజాశక్తి పేపర్‌లో విమానాశ్రయ అదనపు భూముల్లో అడ్డగోలుగా రహదారి అనే ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై తహశీల్దారు చింతాడ బంగార్రాజు స్పందించారు. దీంతో ఆర్.ఐ, విఆర్ఒ సంబంధిత రోడ్డును పరిశీలించారు. అంతేకాక రహదారిని ఏయే సర్వే నెంబర్లులో వేశారో గుర్తించి నివేదిక ఇవ్వనున్నారు. ఈ భూముల్లో నుంచి ఎయిర్‌పోర్ట్ అథారిటీ డెవలప్‌మెంటు కార్పొరేషన్ రహదారిని నిర్మించిదని నమ్మించేందుకు తమ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. అయితే వారి నిర్మించితే ఒక ప్రైవేటు లేఅవుట్‌కు రహదారిని వేయాల్సిన అవసరం ఏముందని పలువురు అంటున్నారు. కేవలం ఆ సంస్థ ఈ రహదారిని బీచ్ కారిడార్‌కి వెళు_ందని చూపించి తమ ప్లాట్లును విక్రయించుకునేందుకేనని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా ప్రజల సొమ్ముతో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల్లో నుంచి రహదారిని నిర్మించిన ఆ రిసార్ట్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డిసెంబరులోగా కంటి శస్త్రచికిత్సలు పూర్తి

విజయనగరం : డిసెంబరులోగా కంటి శస్త్ర చికిత్సలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన శస్త్రచికిత్సలపై, కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సుమారు 3,678 మందికి కేటరాక్ట్, గ్లకోమా, టెరీజియం తదితర కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. మరో 100 సురక్ష శిబిరాలను నిర్వహించాల్సి ఉన్నందున, వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటివరకు సుమారు 300 శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని చెప్పారు. డిసెంబరులోగా మిగిలిన శస్త్రచికిత్సలను పూర్తి చేయాలని, దానికి తగిన ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. శస్త్రచికిత్సలకు హాజరయ్యే వారికి ప్రభుత్వమే రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఆసుపత్రులకు తరలించి, శస్త్రచికిత్సలు పూర్తి అయ్యేవరకు రోగులను వైద్యాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రులవారీగా చేయాల్సిన శస్త్రచికిత్సలను ఖరారు చేశారు. అవసరమైతే ఏరియా ఆసుపత్రులనుంచి కంటి డాక్టర్లను రప్పించి, వారిచేత ఆపరేషన్లు చేయించాలని సూచించారు. కంటి వెలుగులో భాగంగా, త్వరలో జిల్లాకు భారీ సంఖ్యలో కళ్లద్దాలు రాబోతున్నాయని తెలిపారు.



రహదారిపై బైఠాయించిన టిడిపి నాయకులు

మాజీ ఎమ్మెల్యే అడ్డగింత

జాతీయ రహదారిపై టిడిపి శ్రేణులు బైఠాయింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడును బొండపల్లి పోలీసుస్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. విజయనగరం నుంచి గజపతినగరం వెళ్తున్న ఆయనను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. వైసిపి నాయకులు చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర నేపథ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో టిడిపి శ్రేణులంతా స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించారు. వైసిపి తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ప్రజలకు కనీసం వాళ్ళ ఇళ్లలో ఉండే స్వేచ్ఛ కూడా లేదా ప్రశ్నించారు. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈనేపథ్యంలో నాయకులందరినీ నెల్లిమర్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, మండలపార్టీ అధ్యక్షులు కృష్ణ, తెలుగు యువత నాయకులు వేమల చైతన్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల రిలే దీక్షలు

విజయనగరం కోట : సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్ఎంయు డిపో అధ్యక్షులు పిజి రాఫెల్ తెలిపారు. శుక్రవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజీ గేటు వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. జోన్ 1 పరిధిలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పలుమార్లు ఇడికి వినతులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో ఈనెల 19 20 తేదీల్లో గేట్ మీటింగ్ నిర్వహించి నిరసనలు తెలిపామన్నారు. అయినా స్పందించకపోవడంతో రెండు రోజులు నిరాహారదీక్షలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బిఎస్ రాములు, అధ్యక్షులు కె.సత్యం, డిపో కార్యదర్శి సిహెచ్. మౌళి, అధ్యక్షులు రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కొత్తవలస


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇందుకూరి రఘురాజుతో కలిసి ఎమ్మెల్యే తుమ్మికాపల్లి సచివాలయం పరిధిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేయడానికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చిందన్నారు. గ్రామ స్థాయిలో సుపరిపాలన అందించేందుకు ఈ వ్యవస్థ దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, డిసిసిబి చైర్మన్ వేపాడ చిన్నారావునాయుడు, ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, స్థానిక ఎంపిటిసి పిల్ల సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శనివారం మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జివి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా అప్రెంటీస్ ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఐటిఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 ఏళ్ల నుంచి 24ఏళ్ల లోపు మహిళా అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు ఒప్పందపురంలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పెంటలు తొలగించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక గొల్లపేటలు ప్రాంతంలో సర్వే నెంబరు 188 లో ఆవులతో నివాస స్థలాల మధ్య అనధికారికంగా గొర్రెల పెంపకందారులు గొర్రెల పెంటలను టన్నుల కొద్దీ నిల్వ చేయడంతో వీధి దుర్గంధభరితంగా తయారయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నిల్వల కారణంగా కాలువలు కూడా మూసుకుపోయి మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడి రహదారి పైకి మురుగు నీరు ప్రవహిస్తోంది. దోమలు, పాములు ఆవాసాలకు అనుకూలంగా మారడంతో ప్రాణభయంతో స్థానిక నివాసితులు ఆగ్రహిస్తున్నారు. స్థానికంగా భవన నిర్మాణ కార్మికుల బిల్డింగ్ పెద్ద రామకృష్ణ బిల్డింగ్ మెటీరియల్ డంపింగ్ కోసం ఒక చోట కాలువను విరగ్గొట్టడం, మరోచోట పూర్తిగా మూసివేయడం వల్ల పరిస్థితి మరింత జటిలంగా మారింది. పంచాయతీ సిబ్బంది పరిశీలించి, కాలువ పూడికలు తీయించి, మరమ్మతులు చేయాలని, మురుగు నీరు ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని, తక్షణమే గొర్రెల పెంటలను తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక ఎంఇఒ కార్యాలయంలో శుక్రవారం ఎంఇఒ త్రినాధరావు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 3వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి విద్యా సామర్థ్య మదింపు సర్వే మండలంలోని 23 స్కూల్లలో, 3,6,9వ తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. ఈ సర్వే నిర్వహణ పై ఎంఇఒ -2 ఆర్. పాపారావు, నెమలాం జెడ్‌పి హెచ్‌ఎమ్ హెచ్‌ఎం జి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా నియమితులైన వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులకు సర్వే నిర్వహణకు సంబంధించి అవసరమైన తగు నియమ నిబంధనలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్వే నిమిత్తం ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, సర్వే నిర్వహించే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, సిఆర్‌పిలు, ఎం ఆర్‌సి స్టాఫ్ పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- డెంకాడ

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ కేంద్రంగా ఈ నెల 29న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఆర్.కృష్ణ, శ్రీదేవి, ఐ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని గొల్లవీధిలో శుక్రవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలన్నారు. ఆయనతో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రామదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, టిపిఒ వరప్రసాద్ ఉన్నారు.

నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఇళ్ల నిర్మాణాలపై సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ప్రారంభించకపోయిన, పునాదుల స్థాయిలో ఇళ్ల నిర్మాణం నిలిపివేసిన వారి పట్టాలు రద్దు చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

ప్రజాశక్తి-సీతంపేట

విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యను బోధించాలని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లీలీరాణి తెలిపారు. శుక్రవారం సవరభాష వాలంటీర్లకు సవరభాషా పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు వాటిని అందజేయాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, సవరభాష విద్యా వాలంటీర్ల రాష్ట్ర కార్యదర్శి ఎస్.దొంబు, పాల్గొన్నారు.

డిసెంబర్ 31 లోగా సర్వే పూర్తి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఈ ఏడాది డిసెంబర్ 31లోగా జగనన్న భూ హక్కు రీసర్వే కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 41 రెవెన్యూ గ్రామాలకు గాను 21 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. 16 రెవెన్యూ గ్రామాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కుమ్మరిగుంట, వీరభద్రం, కంబర, విక్రంపురం, కత్తుల కవిటి, చిన్నగోర, కడకెల్ల, కిమ్మి, వండువ, చలివేంద్రం వలస గ్రామాలలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసినప్పుడు ఒకరి పేరిట ఉన్న భూమి వేరొకరి పేరు మీద కనిపించడం వల్ల ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన వెంటనే సరిచేస్తామన్నారు.

షటిల్ శిక్షణకు చక్రవర్తి ఎంపిక

కురుపాం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా షటిల్ శిక్షణకు కురుపాం గ్రామానికి చెందిన పువ్వల పి.చక్రవర్తి ఎంపికయ్యారు. ఎక్కువ తండ్రి నాగభూషణ షటిల్ సీనియర్ క్రీడాకారుడు. ప్రస్తుతం జెకె షటిల్ క్లబ్ కోచ్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులను షటిల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం చక్రవర్తి షటిల్ శిక్షణకు ఎంపికవడంతో క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

మీటర్ రీడర్స్ సమస్యలపై బైక్ యాత్ర

ప్రజాశక్తి - విజయనగరం టౌన్


విజయనగరంలో బైక్ ర్యాలీ చేస్తున్న మీటర్ రీడర్స్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 3,800 మీటర్ రీడర్స్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర వ్యాప్తంగా మీటర్ రీడర్స్ శ్రీకాకుళం, అనంతపురం, కడప ప్రాంతాలు నుండి బైక్ యాత్రలు శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నుంచి బయలుదేరిన బైక్ యాత్ర శుక్రవారం సాయంత్రం 4 గంటలకు విజయనగరం విద్యుత్ భవనం చేరుకొని సూపరింటెండెంట్ ఇంజనీర్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ బైక్ యాత్రకు ఏపి మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, విశాఖ జిల్లా అధ్యక్షులు క్రాంతి నాయకత్వం వహించారు. బైక్ యాత్రలో పాల్గొని వచ్చిన నాయకులకు విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శులు యం శ్రీనివాసరావు, శ్రీకాంత్, దివాకర్ స్వాగతం పలికారు. ఈ బైక్ యాత్రలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్ పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ బైక్ యాత్రలో వచ్చిన రాష్ట్ర నాయకత్వానికి విజయనగరం జిల్లాలో ఉన్న మీటర్ రీడర్స్ సమస్యలు తెలియజేసారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు మీటర్ రీడర్స్ సమస్యలపై గళం ఎత్తి నినందించారని అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లవుతున్నా ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. గత 10 - 20 సంవత్సరాలగా కనీస వేతనాలు కూడా లేకుండా పీస్ రేటు పద్ధతిలో పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. బైక్ యాత్ర జయప్రదం కావాలని కోరుతూ బైక్ యాత్రలో పాల్గొన్న నాయకులు అభినందనలు తెలుపుతూ మీటర్ రీడర్స్ చేస్తున్న అన్ని పోరాటాలకు సిఐటియు విధానం జిల్లా కమిటీ సంపూర్ణ మద్ద తెలియజేస్తుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ ఎటువంటి పని భద్రతా లేకుండా పీస్ రేటుతో పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి మీటర్ రీడర్స్‌ను, వాళ్ల కుటుంబాలను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కు ప్రభుత్వమే కనీస వేతనాలు అమలు చేయకపోతే ఇక కార్మికులు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ప్రాంతాల నుండి బయలు దేరిన బైక్ యాత్రలు ఈ నెల 31వ తేదీన విజయవాడలో కలిసి భవిష్యత్తు కార్యక్రమం ప్రకటిస్తాయని వెల్లడించారు.

పేదవాడి ఆరోగ్యానికి భరోసా

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆరోగ్యానికి భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గూడెపువలస సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మళ్లీ ఎమ్మెల్యేగా అప్పలనాయుడును మనమంతా గెలిపించుకోవాలని అప్పుడే మన మండలం పూర్తిస్థాయిలో ఇంకా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్ అప్పలనాయుడు, తహశీల్దార్ చింతాడ బంగార్రాజు, పోలిపల్లి వైద్యాధికారి తిరుపతిస్వామి ఇఒపిఆర్‌డి సురేష్, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ, నాయకులు కొల్లి రామ్మూర్తి, దల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భోగాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అన్నారు. శుక్రవారం వెలగవలస సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష నిర్వహించి ప్రతీ ఒక్కరికీ అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్ సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు టి. సత్యం నాయుడు, సర్పంచులు బి శేషగిరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకు వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 16,17 వార్డులలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఎస్.బాబు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టిపిఆర్ఓ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: నగరంలోని వీటి అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ, చిక్కాల వీధిలోని ఆర్కే పాఠశాలలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్ రావు ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, రేగాన రూపా దేవి, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తెర్లాం

ఖాదీ మహోత్సవం 2023 సందర్భంగా మండల కేంద్రంలో మండల స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు గల వివిధ ఉన్నత పాఠశాలల, ప్రాథమికోన్నత పాఠశాలలలో 6,10 తరగతులు విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. వ్యాస రచన పోటీలలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బి.ఏంజెల్ ప్రథమ స్థానంలో, వక్తృత్వ పోటీల్లో అదే పాఠశాలకు చెందిన సాకేటి ఉజ్వల ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ఎంఇఒ త్రినాధ రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అభినందించారు.

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ అక్షరాస్యత విభాగం ద్వారా చేపట్టిన జాతీయస్థాయి ఖాదీ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి, రామభద్రపురం, కొట్టక్కి, బూసాయి వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ బూసాయవలస పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి న్యాయ నిర్ణేతగా దాలి నాయుడు వ్యవహరించారు. వ్యాసరచన లో రామభద్రపురానికి చెందిన వై. దేవి ప్రథమ, బుసాయవలస కెజిబివికి చెందిన మరడ భారతి ద్వితీయ, కొటక్కి ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక్ తృతీయ బహుమతి గెలిచారు. వక్తృత్వ పోటీల్లో రామభద్రపురం పాఠశాలకు చెందిన రేగు భవాని ప్రథమ, కెజిబివికి చెందిన బెవర భవాని ద్వితీయ, బుసాయవలస పాఠశాలకు చెందిన ఉమ్మిరెడ్డి కుసుమ తృతీయ బహుమతులను గెలిచారు.వీరందరూ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ తెలిపారు.


తెర్లాం: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలకు తప్పుడు సంకేతాలు

ప్రజాశకి- విజయనగరం టౌన్

విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, వైసిపి నాయకులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నారని విజయనగరం జనసేన నాయకుడు గురాన అయ్యలు దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల నుంచి సంప్రదాయబద్ధంగా జరుగుతున్న విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలను కూడా కోలగట్ల, ఆయన అనుయాయులు తమ కబంధ హస్తాల్లో బందించి జరిపిస్తున్నారని విమర్శించారు. నిన్నగాక మొన్న సిరిమాను చెట్టును తరలించడంలో నానా రాద్ధాంతం జరిగిన విషయాన్ని అయ్యలు ఈ సందర్భంగా ఉదహరించారు. ఇలాంటి చర్యలతో స్వామి, ఆయన అనుచరులు అమ్మవారి భక్తులకు ఎలాంటి సంకేతాలిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. భక్తులు, ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా తమకి నచ్చిన విధంగా తాము చేసుకుపోతామనే ధోరణిలో వైసిపి నాయకులు వ్యవహరించడం దురదృష్టకరమని అయ్యలు పేర్కొన్నారు. అసలు, పూసపాటి వంశీయుల ఆధ్వర్యంలో, వారి నేతృత్వంలో జరగాల్సిన సిరిమాను సంబరాలపై కోలగట్ల వీరభద్రస్వామి, ఆయన మనుషుల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ప్రతీ విషయంలోనూ జోక్యం చేసుకుంటూ, అన్నీ ఆయన చేతుల్లోకి తీసుకోవడం ఏంటని స్వామిపై ధ్వజమెత్తారు. ఆఖరుకి సిరిమాను సంబరం రోజున యువకులు వేసుకునే టీ షర్టుల పంపిణీ కూడా వైసిపి నాయకుల కనుసన్నల్లో జరగాలనడం దారుణమన్నారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అనేది దేవుడికి సంబంధించిన అంశం కాబట్టి దీనిలో రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదన్నారు. సెక్షన్-30 అమల్లో ఉందంటూ టిడిపి, జనసేన నాయకుల కార్యక్రమాలను అడ్డుకుంటున్న వైసిపి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు ఇవేళ సాధికారత పేరిట విజయనగరంలో బ్కెక్ ర్యాలీ ఎలా చేశారని, ఎలా అనుమతిచ్చారని, మీకైతే ఓ రూలూ మాకైతే మరో రూలా అంటూ ధ్వజమెత్తారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తవలస

రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు తెలిపారు. మండలంలో రెల్లి గ్రామ సభలో ఆయన శుక్రవారం పాల్గొని మాట్లాడారు. ఈ పంటలో నమోదు చేసిన ప్రతి రైతు పేరును గ్రామ సభ నిర్వహించి చదివి వినిపించాలని సిబ్బందికి సూచించారు. ఈ పంట నమోదు ప్రక్రియలో ఏమన్నా చిన్న చిన్న పొరపాట్లు జరిగినట్లుతే, రైతులు గమనించి స్థానిక వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులకు తెలియజేయలని సూచించారు. అలా మీరు తెలియచేసినట్టు అయితే స్పందనలో మరలా సరి చేసే అవకాశం ఈ నెల 29 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోని వ్యవసాయ శాఖ నుంచి వచ్చే వివిధ ప్రయోజనాలను రైతులు పొందాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామ సభల్లో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ విజయ, వ్యవసాయ అధికారిణి మాధురి శరణ్య, విఎఎ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో ఈ పంట నమోదుపై వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు మాట్లాడుతూ ఈపంట నమోదులో పొరపాట్లు ఉంటే ఈ నెల 29లోగా రైతులు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహయ వ్యవసాయ సంచాలకులు వి. హరికృష్ణరాజు, వ్యవసాయ విస్తరణాధికారి టి. రామకోటి, విఎఎలు కిరణ్మయి,పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఇ-పంట నమోదు వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె రవీంద్ర తెలిపారు. మండలంలోని సంత గౌరమ్మపేట రైతు భరోసా కేంద్రంలో ఈ పంట ముసాయిదా జాబితాను, సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామసభను ఆయన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్. రవిచంద్ర కుమార్ రైతుల యొక్క పేర్లు పంట నమోదు వివరాలను చదివి వినిపించి ఆ జాబితా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ పంట సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రీవెన్స్ మాడ్యూల్‌ను అందుబాటులో ఉంచడం వల్ల ఏమైనా మార్పులు ఉంటే రెండు రోజులు అవకాశం ఉందని గ్రామసభకు హాజరైన పెద్దలకు రైతులకు తెలియజేశారు.



కొత్తవలస: మాట్లాడుతున్న జెడి రామారావు

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు, మంచినీటి కుళాయిలను తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కౌన్సిలర్ కొర్లపు రామారావు, గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం వారు మున్సిపల్ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరులకు కూడా ఫిర్యాదులు అందజేసినట్లు తెలిపారు. ఆ గ్రామంలోని సర్వే నెంబర్ 155/12లో ఏడు సెంట్లు, 155/14 లో ఐదు సెంట్లు మున్సిపల్ స్థలంలో బొబ్బిలి మున్సిపాలిటీ తమ గ్రామ ప్రజల అవసరం నిమిత్తం గతంలో కమ్యూనిటీ మరుగుదొడ్లు గదులు, బోరుబావి నిర్మాణం చేపటికటందన్నారు. వాటిని ప్రజలు సరిగా వినియోగించనందున అవి చిదిలమయ్యాయని గుర్తు చేశారు. వాటి పక్కనే వున్న గ్రామానికి చెందిన తెంటు రామకృష్ణ, తెంటు సత్యనారాయణలు వాటిని తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అక్రమంగా భవనాలు కూడా నిర్మించుకున్నారన్నారు

రెవెన్యూలో రికార్డుల ట్యాంపరింగ్

శృంగవరపుకోట : ఎఫ్‌సిఒ రికార్డులలో నమోదైన పేరును తొలగించి వైసిపి నాయకుడు పేరు చేర్చి రికార్డులను ట్యాంపరింగ్ చేశారని జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు ఆరోపించారు. ఈ సందర్భంగా శుక్రవారం బాధిత రైతు కుటుంబాలతో కలిసి తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్.కోట రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 82/2లో భూమికి రొంగలి దేముడు పేరుమీదే ఎఫ్‌సిఒ రికార్డులో పేరు నమోదైతే దానిని కొట్టివేసి విన్నకోట సత్యనారాయణ తండ్రి పెద్ద జోగారావు పేరు రాసి రికార్డ్ ట్యాంపరింగ్ చేశారన్నారు. భూమి సాగులో రొంగలి దేముడు నాటి నుండి నేటి వరకు ఉన్నప్పటికీ సదరు భూమి అంబటి రమేష్ ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో సిమెంట్ స్తంభాలు పాతే ప్రయత్నం జరుగుతుందన్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు ఆక్రమణ ప్రయత్నాన్ని నిరోధించి ఎంక్వయిరీ చేసి సాగు హక్కు కల్పించాలని కోరుతూ తహశీల్దార్‌కి, ఎస్.కోట ఎస్.ఐ తారకేశ్వరావుకు వినతి పత్రాలు ఇచ్చామని సన్యాసినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగు రైతు రొంగలి దేముడు, టిడిపి మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, మాజీ ఎంపిటిసి కిడారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పాఠాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై ఎఒ కె.తిరుపతిరావు అవగాహన కల్పించారు. శుక్రవారం పి.కోనవలస క్లస్టర్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను ఉపాధ్యాయులు జానకి ఆధ్వర్యాన విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ తిరుపతిరావు అజోల్ల తయారీ, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సిఆర్‌పిలు సురేష్, విజయ ఆధ్వర్యంలో ఆకుచుట్టు పురుగు, కాండం తొలుచు పురుగుల నివారణకు ఉపయోగపడే పంచపత్ర కషాయం తయారీని వివరించారు.

లెండిలో సిఎస్ఇ ఎఐ బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కంప్యూటింగ్ ఫర్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(సిఎస్ఇఎఐ) పై 'స్ప్రింగర్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ 2023' బ్రోచర్‌ను విడుదల చేశారు. లెండి, అమెరికాకు చెందిన కాలిఫోర్నియా సహకారంతో కంప్యూటింగ్ కోసం సైన్స్, ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ విధంగా ఉపయోగపడతాయో అన్న అంశంపై జరుగుతున్న పరిశోధనల కోసం సిఎస్ఇఎఐ 2023 పేరిట అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన నియమనిబంధనల బ్రోచర్‌ను ప్రధాన హోస్ట్ సంస్థ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం కళాశాల సెమినార్ హాల్లో ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విడుదల చేసింది.

ఈ కాన్ఫరెన్స్ నవంబర్ 24-25 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు కన్వీనర్‌గా ఉన్న సిఎస్ఇ హెచ్ఓడి డాక్టర్ ఎ.రామారావు కాన్ఫరెన్స్ థీమ్‌ను ప్రకటిస్తూ కాఫెరెన్సు ప్రొసీడింగ్స్ ముఖ్యాంశాలను వివరిస్తూ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వివి రామారెడ్డి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ఇతర అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి సర్కారు.. రైతులను నట్టేట ముంచే విధంగా వ్యవహరిస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని దిబ్బగుడివలసలో నీరు లేక ఎండిపోయిన వరి పంటను టిడిపి బృందం పరిశీలించింది. వర్షాలు కురవక నీటి ఆధారం లేక పంటలు ఎండిపోయాయని, ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడితో వరి పంట ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు జిల్లాలో పర్యటించి పరిస్థితి అంచనా వేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉండగా, బస్సుయాత్రల పేరిట ప్రజలను ఏమార్చేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జిల్లాలోని కరువు పరిస్థితులను అంచనా వేసి, కరువు మండలాలను ప్రకటించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన పిల్ల ఈశ్వరరావు గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్ కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. మద్యానికి బానిసవడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆదారంగా కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

17 మద్యం బాటిల్స్ పట్టివేత

శృంగవరపుకోట: మండలంలోని కొత్తూరు గ్రామంలో 17 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిఐ ధర్మారావు తెలిపారు. కొత్తూరులో బెల్ట్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించి ఎస్.కోట - తలారి గ్రామానికి చెందిన ఇమ్మిడి శెట్టి సాయిరాం అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

నెల్లిమర్ల: స్థానిక జ్యూట్ మిల్ గేటు సమీపంలో రైలు ఢీకొట్టి ధర్మవరపు రమణ (53) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. జరజాపుపేటకు చెందిన ధర్మవరపు రమణ రైలు పట్టాలు దాటుతుండగా ఎదురుగా వస్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రమణ రజక వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కొమరం భీమ్ వర్ధంతి

ప్రజాశక్తి- సీతంపేట

కొమరం భీమ్ 83వ వర్ధంతి సభను స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం నైజాం, బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన యోధుడు కొమరం భీమ్ అన్నారు. గిరిజనుల స్వేచ్ఛ కోసం ఉద్యమం నడిపించారని తెలిపారు. సమావేశంలో బి.సాయి, ఎ.భాస్కర్‌రావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.దొంబు, ఎస్.ఆనంద్, మాసయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

పశువైద్య శిబిరాలతో మేలు

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని వెదుళ్ళవలస గ్రామంలో 'జాతీయ సేవా పథకంలో' భాగంగా ఉచిత పశువైద్య శిభిరం, పశువైద్య శిబిరాలతో రైతులకు మేలు అనే కార్యక్రమాన్ని శుక్రవారం గరివిడి పశుసంవర్ధక పాలటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. బసవ రెడ్డి, పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ప్రభాకర్ రావు, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ గుడివాడ తమ్మి నాయుడు మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సురేష్ కుమార్, విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

పొలంగూడ గ్రామంలో నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యాధికారి అభినవ కుమార్ సీజనల్ వ్యాధులపై ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. జ్వరాల లక్షణాలు, మలేరియా ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ముందస్తు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి వివరించారు. జ్వరాలు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని, అంతేతప్ప పసర మందులు వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ ఉన్నత పాఠశాలల పిడిలు, పిఇటిలకు శుక్రవారం ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలన్నింటికీ ఈ సామగ్రి పంపిణీ చేస్తామని తెలిపారు.